క్లుప్తంగా

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి

బంట్వారం: సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్(ఎస్ఎంఏఎం) పథకం కింద సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వనున్నట్లు బంట్వారం ఏఓ శ్రావ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటగా ఎస్సీ, ఎస్టీ, చిన్న–సన్నకారు అలాగే మహిళా రైతులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. వీరికి 50శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ పథకం కింద కోట్‌పల్లి మండలానికి 250 బ్యాటరీ స్ప్రేయర్లు, 21 పవర్ ఆపరేటర్ స్ప్రేయర్లు, 10 రోటావేటర్లు, 10 కల్టివేటర్లు, డిస్కహారోలు, 2 సీడ్ ఫెర్టిలైజర్‌డ్రిల్, 1 పవర్ టిల్లర్ కేటాయించారన్నారు. ఆసక్తిగల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు దరఖాస్తు ఫారంకు జతచేసి రైతు వేదికల్లో అందజేయాలని సూచించారు.

మహిళలు రుణాలను వినియోగించుకోవాలి



ఏపీఎంను సన్మానిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

కుల్కచర్ల: మహిళలు బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహిళ సంఘాల ప్రతినిధులతో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సమాఖ్య ద్వారా జీవన అభ్యున్నతికి అవసరమైన ఆర్థికపరపతిని పెంపొందించుకునేందుకు రుణాలను తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే కుటుంబాలు ఉన్నతిని సాధిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సీసీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌ను విశ్వగురువుగా నిలుపుదాం



దుబాయి ప్రచారంలో శంకర్ స్వామిజీ

బషీరాబాద్: ప్రపంచానికి భారత్‌ను విశ్వగురువుగా నిలుపుటకు భారతీయులందరూ కృషి చేయాలని సాధూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ శంకర్ స్వామీజీ పిలుపునిచ్చారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా సోమవారం దుబాయిలో అష్టలక్ష్మీ మహాపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ప్రపంచంలో హిందువులు ఏ మూలాన ఉన్న దేశ ఔనత్యాన్ని చాటి చెప్పాలని సూచించారు. అరబిక్ దేశాల్లోనూ భారత సంస్కృతి పరిఢవిల్లుతోందన్నారు. అనంతరం అక్కడి భక్తులకు స్వామిజీ లక్ష్మీమాత ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అంజనీ సరాఫ్, నిలేష్ శెట్టి, అనంత్ సరాఫ్, పద్మ, లక్ష్మి, సీతారాం, అశోక్‌తో పాటు 250 మందికి పైగా తెలుగువాళ్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నిరుపేద ప్రజలకు పార్టీ అండగా ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నల్లమల నర్సయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాయకులు వారి ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించి, అంత్యక్రియలకు ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం హన్మపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములును బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ సోమవారం పరామర్శించారు. నర్సిములు కాలికి శస్త్ర చికిత్స కావడంతో ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటునట్లు మలేరియా, ఫైలేరియా ప్రత్యేక అధికారి పక్కీరప్ప అన్నారు. సోమవారం గ్రామంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఉన్న మురుగు కాలువల గుండా దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తిప్పలు



దౌల్తాబాద్‌లో బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

- ఇందిరమ్మ ఇంటికి జాడలేని సాండ్ బజార్లు
- బయట రూ.2,500లకు టన్ను కొనుగోలు
- బిల్లుల చెల్లింపుల్లోనూ చిక్కులు
- అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

దౌల్తాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరుపేదలకు భారంగా మారింది. ఇంటి నిర్మాణానికి ఇసుక తిప్పలు తప్పడంలేదు. సాండ్ బజార్లు ఏర్పాటు చేసి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామన్న అధికారుల మాటలు నీటి మీద రాతలుగా మారాయి. దీంతో ఇంటి నిర్మాణ వ్యయంలో సుమారు మూడో వంతు ఇసుక కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందని లబ్ధిదారులు వాపోతున్నారు. బయట టన్నుకు రూ.2,500 చెల్లించి కొనుగోలు చేస్తున్నామని దీనికి రవాణా చార్జీలు అదనమని వాపోతున్నారు. ఇసుక అనుమతి కోసం తహసీల్దారు కార్యాలయంలో సంప్రదిస్తే మండలంలోని ఇసుక లేని కారణంగా టోకెన్లు ఇవ్వలేమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభానికి ముందు మండలంలో పక్క మండలాల నుంచి ఒక ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.4వేలకు తెచ్చి దళారులు పోసేవారు. ఇళ్ల పథకం ప్రారంభం తరువాత అక్రమదారులు ఇసుక ట్రాక్టర్ రూ.6వేలకు పెంచేశారు. దీంతో లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 287 ఇళ్లు మంజూరు కాగా 160 ఇళ్లకు ముగ్గు పోశారు. అలాగే పైలెట్ ప్రాజెక్టు కింద నాందారం గ్రామంలో 29 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 12 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. అప్పటి నుంచి ఇసుక మొదలుకొని సిమెంట్, స్టీలు, మేస్త్రీలు, కూలీల ఖర్చులు ఇలా అన్నింటికీ ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలతో ఇల్లు నిర్మాణం పూర్తయ్యేనా అంటూ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక, స్టీల్ ఇతర సామగ్రి ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ధరలు పెరిగాయి



ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే అన్ని రకాల సామగ్రి ధరలు పెరిగాయి. ఇసుక, కంకర, స్టీలు, సిమెంటు ధరలతో పాటు కూలీలు, మేస్త్రీల ఖర్చులు సైతం అమాంతం పెంచారు. ప్రభుత్వం అందించే రూ.5లక్షలతో ఇల్లు పూర్తికాదు. ఇప్పటికైనా ధరలను నియంత్రించే చర్యలు తీసుకోవాలి.

– అరుణ, దేవర్‌ఫసల్వాద్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతలో మంజూరై కొనసాగుతున్న నిర్మాణదారులు పనుల్లో వేగం పెంచాలన్నారు. సాంకేతిక సమస్యలను తెలియజేస్తే ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, మాజీ సర్పంచ్ వెంకటయ్య, నాయకులు రాంరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గురువుల మార్గం అనుసరణీయం



కొడంగల్ రూరల్: సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొడంగల్ రూరల్: విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది ఉపాధ్యాయుడు ఒక్కడే అని ఎంజేపీటీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి గురువు ఉంటారని, వారి చూపిన మార్గంలో ముందుకు వెళ్తే తప్పకుండా విజయం లభిస్తుందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



దుద్యాల్: సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉపాధ్యాయులకు సన్మానం

ధారూరు: మండలంలోని 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం అధికారులు సన్మానించారు. ఎంపీడీఓ నర్సింహులు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డిలు ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, మెమొంటోలు అందజేశారు.

నేడు కొడంగల్‌లో పంట నమోదు

కొడంగల్: పట్టణంలోని వడ్డర్ గల్లీలో మంగళవారం ఉదయం 10 గంటలకు పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టా పాసుపుస్తకం తీసుకొని వచ్చి వారి పొలాల్లో ఏం పంటలు వేశారో నమోదు చేయించాలని కోరారు. పంట దిగుబడి వచ్చిన తర్వాత ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే పంట నమోదు తప్పనిసరి వివరించారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించండి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల కేంద్రంలోని బీరప్పగడ్డ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఎంపీడీఓ రతన్ సింగ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. బీరప్పగడ్డ కాలనీలో మురుగుకాల్వలు నిర్మించకుండానే సీసీ రోడ్డు నిర్మించారన్నారు. దీంతో వర్షాకాలంలో వరదనీరు ఇళ్లల్లోకి వస్తోందన్నారు. అధికారులు స్పందించి వెంటనే మురుగుకాల్వలు నిర్మించాలని కోరారు.

ప్రతి మహిళ చదువుకోవాలి



యాలాల: ఉల్లాస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్పీ ప్రభాకర్ చారి

యాలాల: గ్రామాల్లోని ప్రతి మహిళ అక్షరాస్యులుగా మార్చేందుకే ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా రిసోర్స్ పర్సన్ ప్రభాకర్‌చారి అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ హాలులో ఎంఈఓ రమేష్ ఆధ్వర్యంలో ఐకేపీ సిబ్బంది, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ విద్యావంతురాలు అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి, వ్యవహారాలు మెరుగవుతాయన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో గుర్తించిన వాలంటీర్లతో మహిళల విద్యాభ్యాసం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్స్ పరమేష్, శివప్ప తదితరులు ఉన్నారు.

ఉల్లాస్ కేంద్రాలు నిర్వహించాలి

బొంరాస్‌పేట: చదువుకు దూరమైన వయోజనుల కోసం ఏర్పాటు చేసిన ఉల్లాస్ కేంద్రాలను నిర్వహించాలని మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నవభారత్ సాక్షరత కార్యక్రమం పట్ల మహిళా గ్రామసంఘాల వీఓఏలకు శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న విలేజ్ రీసోర్స్ పర్సన్(వీఆర్పీ)లకు ఎంఈఓ హరిలాల్, ఆర్పీలు శిక్షణ కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఇందులో సీఆర్పీలు సోమ్లా, శంకరయ్య తదితరులున్నారు.

విద్యతోనే అభివృద్ధి

కుల్కచర్ల: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని కస్తుర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో అక్షరాస్యత పెరగడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

మండల కేంద్రంలో ర్యాలీ

దుద్యాల్: ప్రతి ఒక్కరూ చదువుకోవాలని మండల విద్యాధికారి విజయ రామారావు సూచించారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సమావేశంలో ఏర్పాటు చేసి మాట్లాడారు. చదువుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించండి



కళాశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు

పరిగి: తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డలో గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. సగం అకాడమిక్ ఇయర్ పూర్తవుతున్నా ఇంతవరకు అధ్యాపకులను నియమించలేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా గణితం, కెమిస్ట్రీ అధ్యాపకులు లేక తరగతులు నడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రిన్సిపాల్‌ను అడిగితే త్వరలోనే నియమిస్తామని చెప్పారన్నారు. కానీ ఇప్పటివరకు నియమించకపోవడంతో తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. అధ్యాపకులు లేకుండా విద్యార్థులు పాఠాలు ఎలా నేర్చుకుంటారని ప్రశ్నించారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి వెంటనే అధ్యాపకులను నియమించాలని కోరారు. లేదంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి

బొంరాస్‌పేట: మండల పరిధిలో కొనసాగుతున్న బీటీ డబుల్ రోడ్డు పనులను సోమవారం పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బొంరాస్‌పేట నుంచి జిల్లా కేంద్రం వెళ్లే నాగారం డబుల్, బీటీ రోడ్డు, మహంతీపూర్ వంతెన నిర్మాణాలకు రూ.1.80 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. వీటిని ఎస్ఈ, ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సింలుగౌడ్ పరిశీలించారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి యూపీఎస్‌ను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సందర్శించారు. ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు కృషిచేస్తామన్నారు. పాఠశాలకు ప్రహరీ ఏర్పాటుకు రూ.20లక్షల నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కొడంగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ

కొందుర్గు: మండలంలోని ఉమ్మెంత్యాల గ్రామంలో సోమవారం నాయకులు లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం పేద ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పేదలందరికీ కార్డులు పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉమ్మెంత్యాలలో 14 మందికి కొత్త రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, లక్ష్మయ్య, మల్లేశ్, పాండు, అంజయ్య, అమర్‌నాథ్ రెడ్డి, సాయికుమార్, వీరేశ్ పాల్గొన్నారు.

సులభతర పద్ధతిలో బోధన



కుల్కచర్ల: సమావేశంలో ఉపాధ్యాయులు

కుల్కచర్ల: బోధనోపకరణాలతో పాఠ్యాంశాలు చెప్పడంతో విద్యార్థులకు సులభంగా పాఠాలు అవగతం అవుతాయని ముజాహిద్‌పూర్ క్లస్టర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల మానసికస్థితికి అనుగుణంగా బోధనా విధానాలను అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ రాజు, ప్రధానోపాధ్యాయుడు సతీష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సంతోష్, రాజు పాల్గొన్నారు.


పూడూర్‌లో..

పూడూర్: ఉపాధ్యాయులు, విద్యార్థులకు తప్పకుండా టీఎల్‌ఎంలతో బోధన చేయాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోధన సులభతరానికి టీఎల్‌ఎంలు ఎంతో దోహదపడుతాయని సూచించారు. మేళాలో పాల్గొని మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా టీఎల్ఎం మేళా

దోమ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శన(టీఎల్ఎం) మేళాను మండల విద్యాధికారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయా పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివిధ రకాల బోధనోపకరణాలతో ప్రదర్శనను చేయించి చిన్నారుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ గ్యామా ముఖ్యఅతిథిగా హాజరై తిలకించారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలని ఎంపీడీఓ సూచించారు.

నోట్ పుస్తకాల అందజేత



మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహిపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు ఆయనకు శాలువా, పూలమాలలతో సన్మానించారు. మంబాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు రాంరెడ్డి, జితేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానని పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాటి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం 150 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చుతో షూ, సాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డిని డోజర్‌తో తొలగించి చదును చేయించారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆయనను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు ఉమాదేవి, అలివేలు, బిబి హజ్రా, నాయకులు వీరారెడ్డి, ఓంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, శంకర్, మల్లేశ్, నిజాం, నర్సింహ పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా విడుదల



తాండూరు రూరల్: రాజకీయ నాయకులతో సమావేశమైన ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు రాజకీయ నాయకులు సహకరించాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల ఓటర్ల తుది జాబితా విడుదల చేశారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు మండలంలో ఒక జెడ్పీటీసీ, 15 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయన్నారు. మండలంలో మొత్తం 46,640 ఓటర్లు ఉన్నారన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి 78 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్ల డ్రాఫ్ట్‌పై ఏమైన సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే చెప్పండి

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియపర్చాలని ఎంపీడీఓ రాములు అన్నారు. సోమవారం ఆయన బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు రొంపల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మృతుల పేర్లు తొలగించండి

ధారూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన పోలింగ్ స్టేషన్‌లపై అభ్యంతరాలు, ఎలక్టోరల్ డ్రాఫ్ట్‌లపై రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు మాట్లాడుతూ.. తరిగోపుల, ఎబ్బనూర్, ధారూరు, గట్టెపల్లి తదితర గ్రామాల్లో మృతి చెందిన వారి పేర్లను ఏళ్లు గడుస్తున్నా తొలగించడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి వాటిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నర్సింహులు, తహసీల్దార్ సాజిదాబేగం, వివిధ పార్టీల నాయకులు రాజునాయక్, మొయిజ్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.

42 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

దుద్యాల్: మండల వ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు 42 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ మహేశ్ కుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన వెల్లడించారు. మండల వ్యాప్తంగా మొత్తం 8 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా 21,078 మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళ ఓటర్లు–10,830 మంది, పురుష ఓటర్లు–10,248 మంది ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సహకరించాలి

కుల్కచర్ల: స్థానిక ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఆయా పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో..

నవాబుపేట: స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఒక జెడ్పీటీసి, 12 ఎంపీటీసీలు ఉండగా, 37,786 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.



బంట్వారం: రాజకీయ పార్టీల నాయకులతో చర్చిస్తున్న ఎంపీడీఓ రాములు



దుద్యాల్: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు